# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని థాయ్‌లాండ్ కి చెందిన ఓపల్ సుచాత సొంతం చేసుకున్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా చౌక ధరల దుకాణాల ద్వారా ఈరోజు నుంచి సరకులు పంపిణీ చేయనున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**
4. **ఉమ్మడి నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో మసూలా బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరులో నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. పాఠశాలలు తెరిచే లోపు 'అమ్మకు వందనం' పథకం కింద 15వేల రూపాయలను అందిస్తామని ముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్...30 సెకన్లు

--------------------------

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ప్రపంచ సుందరి 2025 ఫైనల్స్ గత రాత్రి ఘనంగా జరిగాయి. మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని థాయ్‌లాండ్ కి చెందిన ఓపల్ సుచాత సొంతం చేసుకున్నారు. థాయ్‌లాండ్ నుంచి మిస్ వరల్డ్ టైటిల్ గెలుచుకున్న తొలి మహిళగా నిలిచారు. ఈ పోటీల్లో మొదటి రన్నరప్‌గా ఇథియోపియాకి చెందిన హాసెట్ డెరెజే, రెండవ రన్నరప్‌గా పోలండ్ దేశస్థురాలు మయా క్లైడా, మూడో రన్నరప్‌గా మార్టినిక్‌కి చెందిన ఆరేలి జోచిమ్ నిలిచారు. కాగా భారత్ తరపున పోటీల్లో పాల్గొన్న నందిని గుప్తా టాప్-20లో నిలిచారు. హైదరాబాద్ వేదికగా మూడు వారాలపాటు జరిగిన మిస్‌వరల్డ్ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 108 దేశాలకు చెందిన పోటీదారులు పాల్గొన్నారు. మే 10న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోటీలు ప్రారంభించగా, గత రాత్రి 72వ ప్రపంచ

సుందరి పోటీలు ముగిసినట్లు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రకటించారు.

----------------------------

ప్రపంచ సుందరి పోటీలు ముగింపు సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచం ముందుంచేందుకు మిస్ వరల్డ్ పోటీలు దోహదపడ్డాయని అన్నారు. రాష్ట్ర సంస్కృతిని, చరిత్రను, విలువలను ప్రదర్శించామని పేర్కొన్నారు. 72వ మిస్ వరల్డ్ కిరీటాన్ని కైవసం చేసుకున్న ఓపల్ సుచాతను అభినందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరిలోనూ విజేతలు ఉన్నారని అన్నారు. "మిస్ వరల్డ్ పోటీదారులు వారి నిబద్ధత, మేధస్సు, విలువలు, అందం, ఉద్దేశాలను ఆవిష్కరించారు. ఈ పోటీల ద్వారా 'తెలంగాణ రైజింగ్'ను ప్రపంచానికి పరిచయం చేశామని పేర్కొన్నారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 29 వేల 796 చౌక ధరల దుకాణాల ద్వారా ఈరోజు నుంచి సరకులు పంపిణీ చేయనున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు జూన్ ఒకటి నుంచి దీనిని అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల 74 వేల 57 మంది దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందిస్తామని చెప్పారు. నెలలో తొలి 15 రోజులు సరకులు అందిస్తామని, ఆదివారం కూడా రేషన్ దుకాణాలు పని చేస్తాయని మంత్రి వెల్లడించారు.కాకినాడ జిల్లా పిఠాపురంలో చౌక ధరల దుకాణం వద్ద సరకులు పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించనున్నారు.

----------------------------

చారిత్రక, సాంస్కృతిక, కట్టడాల జీర్ణోద్ధరణకు కృషి చేసిన గొప్ప పాలకురాలు అహల్యాబాయి హోల్కర్ అని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో నిర్వహించిన అహల్యాబాయి త్రిశతాబ్ది ఉత్సవాలలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్...30 సెకన్లు

----------------------------

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. నిడదవోలులో రైలు వంతెన మార్గాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మురుగు కాలువల్లో పూడిక ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన రహదారిని నిర్మించనున్నామని మంత్రి తెలిపారు.

----------------------------

ఉమ్మడి నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, ధాన్యం కొనుగోలు, వానాకాలం పంట సన్నద్ధతపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి మంత్రి సమీక్ష

నిర్వహించారు. అనంతరం తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ,

వాయిస్.. 30సెకన్లు

-----------------------------

ప్రాచీన చరిత్ర కలిగిన మచిలీపట్నం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ఆంధ్రపరదేశ్ ప్రభుత్వం లక్ష్యమని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సురక్షితమైన బీచ్‌ల్లో ఒకటైన మంగినపూడి బీచ్ ను ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు ఏర్పాట్లను ఇప్పటికే ప్రారంభించామని మంత్రి తెలిపారు.

-----------------------------

ఉగ్రవాదాన్ని నిర్మూలించే విషయంలో భారతదేశం తన నిబద్ధతను చాటుకునే ప్రయత్నంలో భాగంగా ప్రపంచ దేశాలలో 7 అఖిల పక్ష ఎంపీల బృందాలతో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా డెన్మార్క్ లో పర్యటిస్తున్నబిజెపి ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిల పక్ష బృందంకోపెన్‌హాగన్‌లో అక్కడి ప్రవాస భారతీయులతో సమావేశమైంది. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ దృఢమైన వైఖరిని, నిబద్ధతను ప్రపంచానికి తెలియజేస్తున్నామని అన్నారు. సీమాంతర ఉగ్ర వాదంపై దేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభించిందని చెప్పారు.

-----------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితి గురించి వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంటకరావు తెలుపుతూ,

వాయిస్... 23 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రెండురోజులపాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================